ప్రజాశక్తి
www.prajasakti.com
శనివారం 22 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్



'సజ్జల' కుటుంబీకుల భూముల సర్వే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : వైసిపి నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబీకుల భూములపై రహస్య సర్వే కొనసాగుతోంది. గురు, శుక్రవారం ఫారెస్ట్, ల్యాండ్స్ అండ్ సర్వే, రెవెన్యూ ఉన్నతాధికారుల బృందం జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు సమీపంలోని సజ్జల ఎస్టేట్‌కు చేరుకుని రహస్య సర్వే చేపట్టింది. ఎస్టేట్‌కు తాళం వేసి మీడియాను అనుమతించకుండా రహస్యంగా సర్వేకు శ్రీకారం చుట్టడం చర్చనీయాంశంగా మారింది. సజ్జల ఎస్టేట్‌లోని 180 ఎకరాల్లో రెవెన్యూ, ఫారెస్ట్, డికెటి భూముల వివరాలను పూర్తి స్థాయిలో సర్వే చేయడం ద్వారా నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫారెస్ట్ భూమి ఆక్రమణపై పలు రకాలుగా ప్రచారం సాగుతోంది. మూడు రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశాలు లేవని, పూర్తి స్థాయిలో సర్వే చేయడానికి మరింత సమయం తీసుకునే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. పూర్తి స్థాయి సర్వే అనంతరమే ఎస్టేట్‌లో ఫారెస్ట్, రెవెన్యూ, డికెటి తదితర భూముల వాస్తవ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయాలి

పరీక్షల్లో రోస్టర్ విధానాన్ని సరిచేయాలి
కలెక్టరేట్ వద్ద నిరసనలో నాయకులు


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న నిర్వహించే గ్రూప్ - 2 మెయిన్స్ పరీక్షలలో రోస్టర్ విధానం సరి చేయాలని కోరుతూ గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిఐఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. డివైఎఫ్ఐ, గ్రూప్ - 2 అభ్యర్థుల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏడేళ్ల తర్వాత నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీకి పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఒక వైపు పరీక్షలు జరుగుతున్నాయని ఆనందపడాలో,మరో వైపు రోస్టర్ విధానం సరిగ్గా లేదని బాధపడాలో తెలియని అగమ్యగోచరంలో అభ్యర్థులు ఉన్నారని వాపోయారు. గత ప్రభుత్వం అనేక పోరాటాల తర్వాత గ్రూప్ - 2లో 899 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, రోస్టర్ పాయింట్స్‌లో తప్పులు ఉన్నాయని నిరుద్యోగులకు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల కోసం సుమారు 92,250 మంది అభ్యర్థులు ఈనెల 23న మెయిన్స్ పరీక్షలకు జరుగుతాయో లేదో అనే గందరగోళానికి గురువారం హైకోర్టు స్పష్టత ఇచ్చిందన్నారు. రోస్టర్ పాయింట్స్ మిస్టేక్స్ సరిచేయకుండా అభ్యర్థులకు న్యాయం జరగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అభ్యర్థులకు అనుమానాలకు నివృత్తి చేయాలని కోరారు. రెండు వారాల నుంచి నిరుద్యోగులు మానసిక వేదనతో సతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గతంలోని ఈ ప్రభుత్వం అంగీకరించిందని ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు. రోస్టర్ విధానంలో తప్పులు ఉండటం వల్ల గతంలో కోర్టులు తీర్పుల ద్వారా కొన్ని రాష్ట్రాలలో నోటిఫికేషన్లు సైతం రద్దు చేయడం, ఉద్యోగం చేస్తున్న వారికి సైతం తొలగించిన సందర్భాలు అనేక ఉన్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇదే సంఘటన జరిగిందని గుర్తు చేశారు. గ్రూప్- 2 అభ్యర్థులకు రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాలని కోరారు. రోస్టర్ సరిచేసి ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి బాధ్యత పెట్టిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రోస్టర్ పాయింట్స్‌లు జరిగే మిస్టేక్స్ సరిచేసి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు నాని, గ్రూప్ - 2 అభ్యర్థులు సుమన్, సిఆర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పూర్ణచంద్ర, చక్రి, రసూల్ బాషా, గోపీచంద్, రంజిత్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : గ్రూప్ - 2 మెయిన్స్ పరీక్షలలో రోస్టర్ విధానం సరి చేయాలని, అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ కోరారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, గ్రూప్ - 2 అభ్యర్థుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు జయంత్, సురేష్ గ్రూప్- 2 అభ్యర్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న నిర్వహించే గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలలో రోస్టర్ విధానం సరి చేయాలని, అభ్యర్థులకు న్యాయం చేయాలని డిఐఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ కోరారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని అభ్యర్థులకు అనుమానాలకు నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు గౌస్, రమణ పాల్గొన్నారు.

బద్వేలు : గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిఐఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె. ఆదిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుమిత్రానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత వచ్చిన నోటిఫికేషన్ రావడంతో అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారన్నారు. నోటిఫికేషన్ లో రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గత ప్రభుత్వం అంగీకరించిందని ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని విమర్శించారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ రూరల్ కార్యదర్శి ఉప్పులూరు బాల గురవయ్య, పట్టణ నాయకులు సురేష్, నరసింహ, మాపిరా పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - బద్వేలు

పేదలు నివాసముంటున్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీలవాసులు కనీస వసతులు కల్పించాలని కోరుతూ బద్వేల్ పురపాలక సంఘ పాలకవర్గ సమావేశం సందర్భంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బద్వేలు పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని రాయప్ప, మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న వారందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనని, రోజువారి కూలీ పనులకు వెళ్లి జీవనం సాగించేవారని పేర్కొన్నారు. అలాంటి వారి తాగునీటి కొళాయిలకు డమ్మీలు బిగించడం మున్సిపల్ అధికారులకు తగదని పేర్కొనా్రు. పేదలు నివాసమున్న ప్రాంతాల వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని కుళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించాలని చెప్పారు. పేదల కాలనీలు ఊరికి దూరంగా కొండ తిప్పల పైన ఉన్నందున నిత్యం విష సర్పాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి వెలగని వీధిదీపాలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. నివాసమున్న ప్రతి కుటుంబానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేసి, విద్యుత్ మీటర్ల కొరకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని చెప్పారు. డోర్ నెంబర్లు లేని నూతన గృహాలకు డోర్ నెంబరు వేసి ఇంటి పన్ను విధించాలని కోరారు. ఆందోళనతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ పేదల కాలనీ అయిన సుందరయ్య కాలనీలో కుళాయి కనెక్షన్లకు డమ్మీలు పెట్టమని, క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది కాలనీలో పర్యటించి సమస్యలన్నిటిని వీలైనంత తొందరగా పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ కైరున్ బీ,సగిలి రాయప్ప, చెప్పలి సుబ్బరాయుడు, పసుపుల మోక్షమ్మ, గంప అనంతమ్మ పార్టీ శాఖా కార్యదర్శులు బాలమ్మ, మస్తాన్ బీ,మూరా ప్రసాద్, కాలనీ వాసులు సుభాన్, రత్తమ్మ, నాగమ్మ, వెంకటరత్నమ్మ, ఓబయ్య వెంకటసుబ్బయ్య, వెంకటపతి, శ్రీను, రత్నం పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పేదలు

మేయర్ రాజీనామా ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం

ప్రజాశక్తి - కడప అర్బన్

మేయర్ సురేష్ బాబు వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరుతో భార్య, కుమారుడిని పెట్టి కాంట్రాక్ట్ పనులను చేశారని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఏ కార్పొరేషన్‌లో ఉండవని, చట్టానికి విరుద్ధంగా వ్యవహరించిన మేయర్ సురేష్ బాబు పదవికి రాజీనామా చేయడమనేది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించేవారు లేరని దోచుకోవడం మొదలు పెట్టారని విమర్శించారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని పేర్కొన్నారు. రాజీనామా చేస్తే ప్రజలు సంతోషిస్తారని తెలిపారు. ప్రస్తుతానికి కమిషనర్ నోటీసులు ఇచ్చారని, త్వరలో ప్రభుత్వం కూడా మేయర్‌కు నోటీసులు ఇస్తుందని చెప్పారు. నాలుగు సంవత్సరాల్లో రూ.26 లక్షల పనులను కేటాయించారని, పది సంవత్సరాల్లో ఎన్ని మంజూరు చేశారో సమాచారం సేకరిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ కడప మన కడప పేరుతో ఎమ్మెల్యే కార్పొరేషన్‌లో తిరుగుతూ ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగ కల్పన కోసం ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహిస్తే 55 కంపెనీలు కడపకు వచ్చాయని తెలిపారు. 8613 మంది రిజిస్టర్ చేసుకోగా 5091 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, 2094 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో జాబు మేళా ఉంటుందని చెప్పారు. ఇలాంటి ఆలోచన వైసిపి నాయకులకు ఏనాడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్లు సూర్యనారాయణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విజయవాడలో మార్చి 1న నిర్వహించే న్యాయ విద్యార్థుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని ఐలు స్టూడెంట్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని శ్రీ బసవరామతారకం మెమోరియల్ లా కళాశాలలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐలు స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వెన్షన్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ వి.హరిత, జి.రవీంద్ర మాట్లాడుతూ విజయవాడ నగరంలో న్యాయ విద్యార్థుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, రాష్ట్రాల నుంచి వివిధ ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతారన్నారు. సదస్సులో న్యాయ విద్యార్థుల అకాడమిక్ ఇయర్, ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్రంలో లా యూనివర్సిటీలు, డిపార్ట్‌మెంట్, ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్, అయా కళాశాలలో అడ్మిషన్స్ వాటికి సంబంధించి, బిఎన్ఎస్ నూతన చట్టాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, న్యాయపరమైన స్వయం ప్రతిపత్తి అంశాల గురించి చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రమా రెడ్డి, నాగరాజు, ధనఆంజనేయులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్ : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్‌పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు 'గ్రీవియన్స్ డే' నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు , ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్‌పికి స్వయంగా విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి ఎస్‌పి భరోసా కల్పించారు.


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

అన్ని కేడర్లల్లో నియామకాలు చేపట్టాలి

- కడప జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి. శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ రంగ బ్యాంకులలో తక్షణమే అన్ని కేడర్లలో నియామకాలు చేపట్టాలని కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి.శ్రీని వాసులు రెడ్డి డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శుక్రవారం సాయంత్రం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ జిల్లా కన్వీనర్ అజీజ్ ఆధ్వర్యంలో కడప నగరం 7 రోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజుల బ్యాంకింగ్ పని విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని ఆపాలన్నారు. ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణను ఆపాల న్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాం డ్ చేశారు. మార్చి నెల 24, 25 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆఫీస్ బేరర్లు, ఎస్‌బిఐ వర్క్ మెన్ నాయకులు రాజశేఖర్, కిరణ్, ఎస్‌బిఐ ఆఫీసర్స్ రీజినల్ సెక్రెటరీ రాంప్రసాద్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ రీజనల్ సెక్రెటరీ హర్షవర్ధన్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ భరద్వాజ, ఎల్ఐసి యూనియన్ నాయకులు ఏ. రఘునాథ రెడ్డి, అవధానం శ్రీనివాసులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : మహాశివరాత్రి పండుగ సందర్భంగా శైవ క్షేత్రాలకు ఈనెల 25 నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నుంచి పొలతలకు 78 బస్సులు, నిత్యపూజకోన 40, శ్రీశైలం 2, రాయచోటి నుంచి పొలతలకు 40, పులివెందల నుంచి 27, భనుకోట 3, బద్వేల్ నుంచి లంకమల 25, బి.మఠం 5, మల్లెంకొండ 12, పోరుమామిళ్ల- ఎన్ఎస్, మఠం 3, మైదుకూరు నుంచి లంకమల్ల 15, జ్యోతి (సావిశెట్టి పల్లె) 2, పోరుమామిళ్ల-జ్యోతి 6, బి.మఠం 15, పొలతల 15, ప్రొద్దుటూరు నుంచి పొలతల 15 ఏర్పాటు చేశామన్నారు. యర్రగుంట్ల-సంగమేశ్వ దేవళాలు 4, అల్లాడుపల్లి దేవళాలు 10, కన్యతీర్థం 6, జమ్మలమడుగు నుంచి ఆదస్వేశ్వర కోన 5, కన్య తీర్థం 2, శ్రీశైలం 2 బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రయివేట్ వాహనాలలో ప్రయాణించకుండా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించాలని పేర్కొన్నారు. మార్చి 1 న గంగమ్మ జాతరకు కడప నుంచి 25 బస్సులు, పులివెందుల నుంచి 25 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. 14న పౌర్ణమి తిరువణ్ణామలై అరుణాచల గిరి ప్రదక్షణకు వెళ్లే భక్తుల కొరకు కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల,మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పురుషులకూ డ్వాక్రా సంఘాలు!



పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటు కసరత్తు ఊపందుకుంది. సమాజంలో ఆర్థికంగా తీవ్ర నిరాదరణకు గురైన భవన నిర్మాణ, గిగ్ తదితర రంగాల్లో వర్కర్లుగా పనిచేస్తున్న పురుషులను ఆదుకోవాలని భావించింది. వలనరబుల్ గ్రూపులను ఆదుకునేందుకు 100 రోజుల యాక్షన్‌ప్లాన్ రూపకల్పన చేసింది. ఆర్థికంగా చేయూతను అందించాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. కడప, అన్నమయ్య జిల్లాల్లో 360 పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ సంవత్సరంలో పురుషుల డ్వాక్రా సంఘాల ఆర్థిక స్వావలంభన, వాటి సాధికారతకు కృషి చేయనున్నారు.

- వల్‌నరబుల్ గ్రూపులకు రుణాలు
- కడపలో 120, అన్నమయ్యలో 70 సంఘాలు ఏర్పాటు
- మార్చి అనంతరం రుణాలు మంజూరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసింది. 2024 డిసెంబర్‌లో కడప జిల్లాలో 188, అన్నమయ్య జిల్లాలో 62 డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. మెప్మా అధికార యంత్రాంగం ఇప్పటి వరకు కడప జిల్లాలో 120, అన్నమయ్య జిల్లాలో 70 పురుషుల డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది. మార్చి నాటికి కడప జిల్లాలో పెండింగ్ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పరుగులు తీస్తోంది. సభ్యులు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉండాలి. ఒక్కో డ్వాక్రా సంఘానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేయనుంది. సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా చితికిన, పేదరికంలో అట్టడుగున నిలిచిన భవన నిర్మాణ కార్మికులు, తాపీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్స్, వాచ్‌మెన్స్, హమాలీలు, టైల్స్, ఇళ్లలో పనిచేసే మహిళా వర్కర్లు, పేషంట్ల దగ్గర పనిచేసే వాళ్లు, పిల్లలను చూసుకునే వాళ్లు, వృద్ధుల సంరక్షకులు, రజకులు, పెంపుడు జంతువులను చూసుకునే వాళ్లు చెత్త వ్యర్థాల సేకరణ కూలీలు, గిగ్ వర్కర్లు జొమాటో, స్విగ్గీ, ర్యాపిడ్, వర్కర్లను ఎంపిక చేయాలని నిర్ణయించింది. కడప జిల్లాలో 188, అన్నమయ్య జిల్లాలో 70 పురుషుల డ్వాక్రా సంఘాలను ఆదుకునేందుకు గల మార్గాలను అన్వేషిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి మూడు నెలల నుంచి ఆర్నెళ్లపాటు ఎంపికైన డ్వాక్రా సంఘాల సభ్యుల బ్యాంకింగ్ లావాదేవీలను పరిశీలించనుంది. ఆయా గ్రూపుల క్రమం తప్పని చెల్లింపుల ఆధారంగా డ్వాక్రా సంఘాలకు ఐదు నుంచి పది రెట్ల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించాలనే ఆలోచనలో ఉంది. మొదటి విడత రుణాల చెల్లింపుల ఆధారంగా మలి విడత రుణాల మంజూరు లక్ష్యాన్ని మరింతగా పెంచడానికి గల అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. మొదటి విడత అనంతరం మహిళా డ్వాక్రా సంఘాల తరహాలో రుణాల లభ్యత ఉంటుందని చెబుతోంది. ఏదేమైనా పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు చెందిన సభ్యులకు బ్యాంకు రుణాల ద్వారా చేయూతను అందించడం ఉపశమనాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దీనిపై మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా సమాజంలోని వల్‌నరబుల్ పురుషులను గుర్తించి, వారి కుటుంబంలోని స్త్రీ, పురుషులతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొనడం గమనార్హం.

తెలుగు భాషను సంరక్షించుకుందాం

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

తెలుగు భాషను మనందరం పరిరక్షించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి యు.మీనాక్షి తెలిపారు. శుక్రవారం వైభవోపేతంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు మండలాలలోని పదో తరగతి విద్యార్థులకు తెలుగు భాషా ఉపాధ్యాయ సమైక్య తరపున ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మూడు మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యి ప్రతిభా పరీక్షను రాశారు. ఈ ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణత విజేతలకు ఉప విద్యాశాఖ అధికారి మీనాక్షి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు మిగిలిన భాషలు నేర్చుకున్నప్పటికీని కూడా తెలుగు భాషను మనం కాపాడుకోవాలని, తెలుగు భాష అమ్మ లాంటిదని ఆమె తెలుగు భాషను కొనియాడారు. కార్యక్రమంలో మూడు మండలాల మండల విద్యాశాఖ అధికారులు చౌడయ్య, రమణారెడ్డి, చంద్రశేఖర్ రావులు, చిట్టి బాబులు, మూడు మండలాల తెలుగు భాషోపాధ్యాయులు నాగేంద్ర, భాస్కర్ రెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

మాతృభాషా వికాసం కోసమే.. మన సంస్కృతి, మాతృభాష వికాసం కోసమే తెలుగు సాహితీ యాత్రలు, మొల్ల జయంతి ఉత్సవాలు ప్రారంభించినట్లు ప్రముఖ సాహితీవేత్త విద్వాన్, డాక్టర్. గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా వికాస ఉద్యమం, మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. **ప్రొద్దుటూరు :** తెలుగు భాష అజంత భాషని, దాని గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సాధు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ గాంధీ పార్క్ లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికార భాష సంఘ పూర్వ సభ్యుడు తవ్వ వెంకటయ్య ఆరవెల్లి రాజా కాశివరపు వెంకటసుబ్బయ్య కొత్తపల్లి శీను జానపద గాయకుడు ఖమ్మం పాములేటి సహదేవుడు నాగుమల్ల విశ్వప్రసాద్ దేవానంద్ డాక్టర్ తవ్వా సురేష్ భవాని శేఖర్ పాల్గొన్నారు.
వేంపల్లె : తెలుగు భాష వారసత్వ ఆస్తి లాంటిదని, రక్షించుకోవడం అందరిపై బాధ్యత ఉందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు పండితులు ధర్మారెడ్డి, కృష్ణవేణి, పద్మజ, జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల తెలుగు పండిట్ వెంకట రమణ, ట్రిపుల్ ఐటీ తెలుగు లెక్చరర్ బ్రహ్మానందయ్యను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, మస్తాన్‌వలి, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, చెన్నకేశవ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వెంకటేష్, మహబూబ్ బాషా, రమణ, నాగరాజు, రవి పాల్గొన్నారు.

25న ప్రజ్ఞ వికాస్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్ఎఫ్ఐ-యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రజ్ఞా వికాస్ పరీక్షలను జయప్రదం చేయాలని డిఇఒ షంషుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని డిఇఒ కార్యాలయంలో ప్రజ్ఞ వికాస్ కరపత్రం డిఇఒ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కె.ఎస్? లక్ష్మణరావు పర్యవే క్షణలో ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులలో పరీక్ష భయాన్ని పోగొట్టడం కోసం మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో అనేకమంది విద్యార్థులు ఒత్తిడిని అధిగమించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అటువంటి విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం, పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టడం కోసం ఈ పరీక్షలను ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. 10వ తరగతి సిలబస్ ఆధారంగానే ప్రశ్నాపత్రం ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రజ్ఞా వికాస్ మోడల్ పరీక్షలలో పాల్గొనేవారు స్కూల్ వివరాలు, వీ సంబంధిత వివరాలు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి 9110399831, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్ 9492805708, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, 8297762173, మోహన్ 9182987503, రాజశేఖర్‌రెడ్డి 9705273497, అజయ్ 7893720393లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడి మునీర్ ఖాన్, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు వినోద్, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య జిల్లా పరిధిలోని గంగమ్మ ఉత్సవాలు పురస్కరించుకుని యువతకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాలు వయసు గల యువత పోటీలలో పాల్గొనవచ్చు అని పేర్కొన్నారు. 1న వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్స్, నేతాజీ సర్కిల్ రాయచోటిలో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో జిల్లా యువత పాల్గొని తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని తెలిపారు. వివరాలకు 9182382644లో సంప్రదించ వచ్చునన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న విజయజ్యోతి

సమాజ అభివృద్ధికి రైతుల సంక్షేమమే ప్రాధాన్యతగా తీసుకుని, వారికి మౌలిక సదుపాయాలు అంది ంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడి పోరాటం సాగిస్తుందని హెచ్చరించారు. శుక్రవారం మీడియాతో విజయ జ్యోతి మాట్లాడారు. కడప పార్లమెంట్ పరిధిలోని బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప, కమలాపురం, జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం, పశువులకు మేత అందుబాటులోకి తేవడం, అలాగే రైతులకు లబ్ధి చేకూర్చే పలు ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతికి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, వ్యవసాయ రంగాభివృద్ధికి ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి అన్నారు. మట్టి ఆరోగ్య కార్డు పథకం రైతులకు మట్టిలో పోషకాలు మెరుగుపరిచే వివరాలను అందించాలని అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ మాన్ధన్ యోజన రైతులకు పింఛన్ లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలి అని కోరారు పథకాల అమలుతో ఎస్‌సి, ఎస్‌టి, చిన్న, సన్నకారు రైతుల సంక్షేమం మరింత బలపడుతుందని చెప్పారు.

మొబైల్ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

'రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం' కు సంబంధించి రెండు మొబైల్ వాహనాలను శుక్రవారం కలెక్టరేట్ వద్ద జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 0 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ప్రజల తరపున పోరాడేందుకు సిద్ధం : వైసిపి

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చంద్రబాబు అంటే కరువు అనేది జగమెరిగిన సత్యమని ప్రజల తరుపున పోరాడేం దుకు తాము సిద్ధంగా ఉన్నామని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం చర్యలేమి తీసుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. వైసిపి నేతలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని, ప్రజల తరపున నిలబడి పోరాడేందుకు వైసిపి నాయకులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సహాయం ఇస్తామన్న హామీని ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఈ- క్రాప్ విధానాన్ని, రైతు భరోసా కేంద్రాలను నాశనం చేసిన ఘనుడు చంద్రబాబు నాయుడు అని ఘాటుగా విమర్శించారు. 'రైతులకు మద్దతు ధర లేదు, భరోసా కేంద్రాలు లేవు, ఈ క్రాపింగ్ లేదు అన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఏకైక వ్యక్తి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాలని జగన్మోహన్ రెడ్డి చెబితే, మంత్రులు వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమని అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు సునీల్ కుమార్, సంబటూర్ ప్రసాద్ రెడ్డి, నాగేంద్రారెడ్డి, షఫీ, శ్రీరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్యపూజకోనకు టికెట్ ధర రూ.90

- ఆర్‌టిసి డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి సోమవారం నిత్యపూజకోనకు కడప డిపో నుంచి రెగ్యులర్ సర్వీసు నడిపేలా ఎండోమెంట్ అధికారులతో ఎంఒయు కుదుర్చుకున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం డిపో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల ఆరోగ్య భద్రతే ప్రదాన లక్ష్యమన్నారు. మహాశివరాత్రి స్పెషల్ సర్వీస్‌లలో ఎటువంటి ఆర్‌టిసి పాసులు , ఆధార్ కార్డు డిస్కౌంట్లు చెల్లవని తెలిపారు. నిత్య పూజకోనకు టిక్కెట్ ధర రూ.90 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులపై భారం లేకుండా నిబంధనల ప్రకారమే టికెట్ ధర నిర్ణయించామని చెప్పారు. భాకరాపేట నుంచి రూ. 60 ఉంటుందని తెలిపారు. నిత్యపూజ కొనకు బస్సు ఏర్పాటుపై సిద్ధం చేసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. సమావేశంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కన్యాకుమారి పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

రైతులకు న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాపాడు

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించి తగు న్యాయం చేస్తామని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం సిద్ధారెడ్డిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవేలో భూములు కోల్పోయిన రైతులు తమకు నష్టపరిహారం అందలేదని సమస్యను ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె రికార్డులను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. రైతుల వద్ద ఉన్న వివరాలను సేకరించి తనకు వెంటనే పంపాలని సిబ్బందికి సూచించారు. గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, డిటి కృష్ణారెడ్డి, ఆర్‌ఐ శివశంకర్ రెడ్డి, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, విర్ఒ సుబ్బన్న, సర్వేయర్ సౌందర్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేపట్టాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం అల్లాడుపల్లెను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26, 27 తేదీలలో యాత్రికులు ఇబ్బందులు కల్గకుండా క్యూ లైన్లు, తాగునీటి వసతి, వాహనాల పార్కింగ్, విద్యుత్ దీపాలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రెండు రోజులపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం దేవాదాయ శాఖ ఎ.సి. మల్లికార్జున ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్, తహశీల్దార్ బ్రహ్మకుమారి, రాధాకృష్ణ వేణి, ఇఒ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఆలయ అర్చకులు ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ప్లస్ పాఠశాలలను కొనసాగించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం జిల్లా పరిషత్ ప్లస్ పాఠశాలలను కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని పిజిటిలు కోరారు. శుక్రవారం వేంపల్లెకు విచ్చేసిన బిటెక్ రవిని కలిసి సమస్యలను విన్నవించారు. జిల్లాలోని 292 హైస్కూల్ ప్లస్ పాఠశాలలున్నాయని, 1752 మంది పిజిటి ఉపాధ్యాయులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. బాలిక విద్యను కొనసాగించేందుకు ప్లస్ హైస్కూల్ రద్దు చేయరాదని తెలిపారు. జిల్లా పరిషత్ మెనేజ్ మెంట్ పాఠశాలలో పని చేస్తున్న 1,50000 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించాలని పిజిటి రాష్ట్ర కన్వీనర్ చెరుకూరి శ్రీనువాసులు కోరారు. 25 సంవత్సరాల నుండి పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రాలేదని చెప్పారు. ఖాళీ ఉన్న పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పిజిటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

దోమలను నియంత్రించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఎర్రగుడిపల్లిలో ప్రజలకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించి, ఆశా కార్యకర్తల నిర్వహిస్తున్న లార్వా సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపుతల సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని చెప్పారు. ఎవ్వరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి వైద్యం చేయాలన్నారు. బాధిత గ్రామంలో ఫీవర్, లార్వా సర్వే చేసి రక్త పరీక్షలు చేయాలన్నారు. కార్యకమంలో డాక్టర్ శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య, ఆరోగ్య కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్త రాజమ్మ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి ఖాజీపేట

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారిణి నాగ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష ఉంటుం దన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12:00 వరకు పరీక్ష ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఐదవ తరగతి స్థాయిలో ఇంగ్లీషు తెలుగు మీడియంలో ఉంటుందన్నారు. ఒసి, బిసి అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ. 150, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల వారికి రూ. 75 ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారని తెలిపారు. ఈనెల 24 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తుకు చేసుకోవచ్చన్నారు.

పి-4 సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి -చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వేకు ప్రజలు సహకరించి సిబ్బందికి సహకరించాలని ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. నిరుపేదలైన ప్రజలకు, సంఘంలో ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తుల నుంచి ఆర్థిక, మౌలిక సదుపాయాలు కల్పించడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్ని యధాతథంగా ఉంటాయని, ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా సచివాలయ సిబ్బంది మీ ఇంటి వద్దకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. మండలంలోని ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని కుమ్మరి కొట్టాలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఆకస్మిక రోడ్డు ప్రమాదంలో లగుడపాటి నరహరి నాయుడు (36) వ్యక్తి మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసుల కథనం మేరకు.. భూమాయపల్లి - కుమ్మరి కొట్టాలు మార్గమధ్యన ఓ కారు మరమత్తుకు గురైంది. కడప నుంచి దువ్వూరు వైపు వెళ్తున్న ఓ వాహనంలోని కొందరి వ్యక్తులు మరమ్మతుకు గురైన కారు వద్దకు వెళ్లి కారును నెట్టుతున్నారు. ఆసమయంలో అదే మార్గంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ వారి ఢీకొంది. ప్రమాదంలో దువ్వూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన నరహరి నాయుడు మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన మరికొందరి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి - వల్లూరు : కడప - తాడిపత్రి జాతీయ రహదారి గోటూరు జింకల వంక బ్రిడ్జి పైనుంచి అదుపుతప్పి కంటైనర్ కింద పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శుక్రవారం మహారాష్ట్ర ట్రాన్స్‌పోర్టుకు చెదిన కంటైనర్ లారీ చెన్నై నుంచి ముంబాయికి బయలుదేరింది.ఇ వల్లూరు మండలం గోటురూ వద్దకు రాగానే కంటైనర్ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

పొరుగు సేవల కార్మికుల కోసం గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని ఈనెల 6న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆప్కా సంస్థను రద్దు చేస్తే కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బద్వేల్ పురపాలక సంఘ పాలకవర్గ సమావేశానికి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ దాసరి సుధాకు యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కాలువ నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు పరచి ఆ స్థానంలో ప్రయివేటు ఏజెన్సీలను ప్రవేశపెడతామని నిర్ణయించడంతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందని, ఆప్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. వెంటనే ఆప్కాస్ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు గంట శ్రీనివాసులు, కోశాధికారి కాలువ శివకుమార్, కార్మికులు అచ్చమ్మ, ఓబులమ్మ, సాయమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు



పట్టా అందుకుంటున్న అంకిరెడ్డి

పేదింటి బిడ్డకు డాక్టర్ పట్టా

ప్రజాశక్తి -చాపాడు

మండల పరిధిలోని కేతవరం గ్రామానికి చెందిన సాధారణ పేదింటి బిడ్డ కష్టపడి చదివి డాక్టర్ పట్టా సాధించాడు. గ్రామానికి చెందిన పోలు అశోక్ రెడ్డి,విజయలక్ష్మి దంపతుల కుమారుడు పోలు అంకిరెడ్డి. ఇతను కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల నుంచి ప్రస్తుతం వైద్య విద్యను పూర్తి చేసి పట్టా అందుకున్నాడు. అంకిరెడ్డి చిన్నతనం నుండి కష్టపడి చదివి వైద్య విద్యను పూర్తి చేశాడు. 10వ తరగతిని నెల్లూరులోని రత్నం పాఠశాలలో చదివి 10/10 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. ఇంటర్ విజయవాడ చైతన్య కళాశాలలో అభ్యసించి 10/10కి సాధించి తన ప్రతిభను కనబరిచాడు. మెడిసిన్‌లో 2004 ర్యాంకును సాధించి కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. ఎమ్‌ఎస్ జనరల్ పూర్తి చేసి పేద ప్రజలకు వైద్యం అందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా అంకిరెడ్డి తెలిపారు. అంకిరెడ్డి తల్లిదండ్రులు అల్లాడుపల్లె వద్ద టీ దుకాణం నిర్వహిస్తున్నారు.

'ఎన్‌ఎంఎం'కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ముద్దనూరు



స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్‌ఎంసిఎం స్కాలర్‌షిప్ కోసం గత ఏడాది డిసెంబర్ 8న పోటీ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 8వ తరగతి చదువుతున్న బొందలకుంటకు చెందిన జి. సుమఅఖిల, తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎన్.శైలు ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు చెప్పారు. ప్రభుత్వం వీరికి ఏడాదికి రూ.12,500 చొప్పున ఇంటర్ మీడియట్ వరకు స్కాలర్‌షిప్ గా ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సైన్స్ టీచర్ కె.హరిప్రియ, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

స్కాలర్ షిప్ నకు ఎంపికైన విద్యార్థులు సుమ అఖిల,శైలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరాజ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోడ్ల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు ఉన్న చెట్లు తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు,ప్రజలు గమనించి సహకరించాలని ఎఇ కోరారు.

గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి- లింగాల

వ్యవసాయ సేవలను సులభతరం చేసి ప్రభుత్వ పథకాలను, సబ్సిడీ రూణాలను రైతులకు అందించేందుకు రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. ఆయన మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుందన్నారు. మండల వ్యాప్తంగా 8000 మంది రైతులకు గాను 3000 మందికి గుర్తింపు సంఖ్య నమోదు చేశారన్నారు. అర్హులైన రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది రాణి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అగ్రిగోల్డ్ బాధితులు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధాను అగ్రిగోల్డ్ బాధితులు శుక్రవారం వైసిపి కార్యాలయంలో కలిసి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం ఎనిమిది రాష్ట్రాలలో 32 లక్షల మంది నుంచి పలు స్కీముల పేరుతో ప్రత్యక్షంగా రూ. 6, 380 కోట్లు డిపాజిటర్ల రూపంలో సేకరించిందన్నారు. కంపెనీ చైర్మన్ అవ్వ వెంకట్ రామారావు, ఆయన సోదరులు కంపెనీ డబ్బులు ఒక్కొక్కరు వందల కోట్లు వ్యక్తిగత ఆస్తులుగా కుటుంబ సభ్యులు బినామీల పేరుతో దోచుకొని బోర్డు తిప్పేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ ఆర్థిక నేరాలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సమయంలో పరిశీలించి చోటు చేసుకున్నవేనని అన్నారు. జప్తు చేసిన ఆస్తులను సిఐడి వారి ఆధ్వర్యంలో గుర్తించి ఈనెల బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, పార్థసారథి, జాన్, బాబు, శేషయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు శంకుస్థాపన

ప్రజాశక్తి- తొండూరు

మండలపరిధిలోని బిసి వసతి గృహంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి చొరవతో ఆయన సతీమణి ఉమాదేవి శుక్రవారం భూమిపూజా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో మౌలిక సదుపాయాలు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు వసతులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు బి.వి రమణారెడ్డి, సైదాపురం నరసింహారెడ్డి, మల్లెల శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, టైలర్ శివారెడ్డి, ఉపేంద్ర నాయుడు, తాళ్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గంగి రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రామాపురం మహేశ్వర్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ ఫరూక్ , ఎఇ కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసింది

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసిందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పనితీరు వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు ఉందని ఆయన విమర్శించారు. రైతులు పండించే ఏ పంటకు కూడా మద్దతు ధర లేదని ఆయన అన్నారు. జగన్ ప్రభుత్వంలో మిర్చి క్వింటాల్ ధర రూ.24 వేలుగా ఉంటే ప్రస్తుతం 9 వేలకు పడిపోయింది అన్నారు. ఎకరా మిర్చి పంట పండించాలంటే ఒకటిన్నర లక్షలు ఖర్చు అవుతుందని రైతులకు వచ్చేది రూ. 50 వేలే అని అన్నారు. ప్రతి ఎకరా పైన మిర్చి రైతు రూ. లక్ష నష్టపోతున్నాడని ఆయన వాపోయారు. జగన్ రైతు పక్షాన మాట్లాడితే కేసులు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి కష్టాల్లో పుట్టిన పార్టీ అని కేసులకు భయపడేది లేదన్నారు. జగన్ చివరి రక్తపు బొట్టు వరకు ప్రజల మధ్య ఉంటారన్నారు. రైతులకు మేలు కలిగించే అన్ని పథకాలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. జగన్ హయాంలో 54 లక్షల 50 వేల మంది రైతులకు రూ.7 వేల కోట్ల పంట నష్టం ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. రైతుల కష్టాలు కన్నీళ్లు చంద్రబాబుకు పాయసంతి రుచిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధైర్యం ఉంటే గుంటూరు మిర్చి యార్డుకుపోయి నిలబడాలని కోరారు. 24 పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించని మద్దతు ధరను జగన్ ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. పంట మద్దతు ధరకు రూ.64 వేల కోట్లు ఖర్చు అయిందని అన్నారు. రైతులకు మేలు కలిగేంతవరకు కూటమి ప్రభుత్వం మినహా అన్ని పార్టీలతో కలుపుకొని ప్రజాస్వామ్య విధంగా పోరాడుతామని రాజమల్లు ప్రసాద్ రెడ్డి అన్నారు.

వైసిపి పులివెందుల అసెంబ్లీ వాలంటరీ విభాగం అధ్యక్షుడిగా మిత్రానంద్

ప్రజాశక్తి - చక్రాయపేట



వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్. జగన్ ఆదేశాల మేరకు పులివెందుల అసెంబ్లీ వాలంటరీ విభాగ అధ్యక్షుడిగా అంతల మిత్రానంద్‌ను నియమించారు. మండలంలోని సురభి గ్రామం బాలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన అంతల మిత్రానంద్ పదవి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. బాధ్యతను అప్పగించిన జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ అవినాష్ రెడ్డి, వై.ఎస్. భాస్కర్ రెడ్డికి, వై.ఎస్. కొండారెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

వైసిపి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి



పులివెందుల రూరల్ : వైసిపి పులివెందుల నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఫోరెడ్డి జస్వంత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు వైసిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తన మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు నిక్కచ్చిగా నిర్వర్తిస్తానని చెప్పారు. పదవి రావడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఓబన్నపేటలో శుక్రవారం కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ పెయ్యి దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా టిడిపి మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ లేగ దూడల ఎదుగుదలకు తీసుకోవాల్సిన సరైన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలు, పాటించాలని లింగ నిర్ధారణ వీర్యం ద్వారా 90 శాతం కచ్చితత్వంతో పెయ్యి దూడల పుట్టుటకు వీర్య నాలికను రూ. 1350 ఇస్తారని, రూ. 850 ప్రభుత్వం రాయితీ పోగా రైతు వాటాగా రూ. 500 మాత్రమే చెల్లించి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి రైతులు, పశు వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జగన్ అరాచకం భరించలేకనే
కూటమిని గెలిపించారు

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లల్లో చేసిన అరాచకం భరించలేకనే కూటమి ప్రభుత్వానికి ప్రజలు జేజేలు పలికారని కూటమినేతలు సింగం నాగేశ్వర్‌రెడ్డి, గోన పురుషోత్తం రెడ్డి సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 8 నెలల్లోనే అభివృద్ధి సంక్షేమం కనపడేలా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పని చేస్తున్నారన్నారు. అభివృద్ధి జరుగుతుంటే సంతోషించాల్సింది పోయి విమర్శించడం ఏంటని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని పరోక్షంగా విమర్శించారు. ఈనెల 23న టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను త్వరలోనే అమలు చేస్తా మన్నారు. సమావేశంలో అంగడి శివ, ఓబుల్ రెడ్డి, బిందు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ అరెస్టు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నర్సాపురంలో పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేసిన తిరుమల నాయక్‌ను కాశి నాయన ఎస్‌ఐ హనుమంతు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. ముద్దాయి నాయక్ 14 సంవత్సరాల నుండి నరసాపురంలో పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ - పోస్ట్ ఆఫీస్ కిందికి వచ్చే ఏడు గ్రామాల ప్రజలను ఆర్‌డి, బీమా ప్రీమియాలను కట్టించుకునేవారు. ప్రజలు ఆయన్ను నమ్మి పోస్టా ఆఫీసులో డిపాజిట్లు చేశారు. అయితే ఆయన రూ. 22.67 లక్షలు మోసం చేసినట్లు డిపాజిట్‌దారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుల మేరకు పోస్ట్‌మాస్టర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్‌ఐ చెప్పారు. ప్రజల సొమ్మును దోచుకున్నట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి ఓబులాపురం దగ్గర అరెస్టు చేస్తామన్నారు నిందితుడి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం పందికుంట ఎస్‌టి కాలనీకి చెందిన వాడని పోలీసులు పేర్కొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

స్టయిఫండ్ పెంచాలని విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

తమకు స్టయిఫండ్ పెంచాలని కోరుతూ మండలంలోని గోపవరం సమీపంలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రపరుస్తూ నిరసన చేపట్టారు. 19వ రోజు వినూత్నంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ముఖ్యమైన భాగమన్నారు. మన కాలశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడం బాధ్యతన్నారు. ప్రతి విద్యార్థి సమాజం కోసం పాటుపడుతూ తన హక్కులను సాధించుకోవాలని తెలిపారు. 2013 నుంచి ఇప్పటివరకూ తమ స్టయిఫండ్ కేవలం రూ.7వేలు ఇస్తున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగినా పెంచలేదని, ఎంబిబిఎస్ విద్యార్థులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించేంత వరకు రోజూ నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమారు 300 మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా అప్పుడే ఆరోగ్యవంతంగా జీవించగలరని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నముక్కపల్లె నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన సందర్శించి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నుంచి రక్షణ పొందేందుకు తెరలను వాడాలని, మురుగునీరు నిల్వచేరకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, స్థానిక వైద్యురాలు అయేషా సుల్తాన ఆధ్వర్యంలో మధు మేహం, నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ వంటి సర్వేలు నిర్వహించారు. చిన్నారులు వ్యాధి నిరోధక టీకాల శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులుకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్ బాబు, కృష్ణప్రియ, ఆశ నోడల్ ఆఫీసర్ అరుణ, ఎఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్‌తో రైతుకు లాభాలు

ప్రజాశక్తి - గోపవరం

వర్మీకంపోస్ట్‌తో రైతుకు ఎన్నో లాభాలున్నాయని ఇఒపిఆర్‌డి హసీనా, కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గోపవరం గ్రామపంచాయతీలో చెత్త నుంచి ఎరువులు తయారు విధానాన్ని వారు రైతులకు వివరించారు. ప్రతి రైతు ఈ వర్మి కంపోస్ట్ ఎరువును వాడాలని ఇది రైతులకు సారవంతమైన భూమిని అందిస్తుందని, పంట బాగా వస్తుందని చెప్పారు. రసాయనిక ఎరువులను వాడొద్దంటూ బావి తరాలను దృష్టిలో ఉంచుకొని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వారు అన్నారు. కార్యక్రమంలో రైతులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి యోగా అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె

మానసిక శారీరక ఆరోగ్యానికి యోగా అవసరమని శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక శాంతికి, ఒత్తిడికి నియంత్రణకు యోగా చాలా ఉపయోగ పడుతుందని చెప్పారు. యోగా చేయడం వల్ల ఏకాగ్రత కూడ పెరుగుతుందని చెప్పారు. సామాజిక ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెప్పారు. అనంతరం యోగా గురించి విద్యార్థులకు యోగా గురువులు రమేష్‌రెడ్డి, లలితా సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.